# 8 హంపీ అనుభవం

మనిషి అన్న తర్వాత జీవితంలో ఎన్నో అనుభవాలు పొందుతాడు. కానీ ఒక్కో అనుభవం, షాక్ లా తగులుతుంది. తగిలి జీవితం పట్ల— వ్యవస్థపట్ల మనకున్న దృక్పథాన్నే మారుస్తుంది. అలాంటి అనుభవాలు అడపా దడపా గానిరావు. నా మట్టుకు నాకు-సావిత్రి అలాంటి అనుభవం కలుగజేసింది.

కాలం-కర్మం-కలిసివచ్చుంటే సావిత్రి నాకు భార్య కావలసింది. అవడానికి నాకు సావిత్రి వేలు విడిచిన మేనమామ కూతురు. ఆ మేనమామ ఎప్పుడో సావిత్రి చిన్నతనంలో పోయాడు. ఆ తర్వాత సావిత్రి బాధ్యత సుందరం-అంటే సావిత్రి అన్న తీసుకున్నాడు. నా పెళ్ళి విషయం ప్రస్తావిస్తూ సుందరమే ఉత్తరం రాశాడు. ఎంతయినా బంధుత్వం-మా అమ్మ ఉత్తరం చూచి సంబరపడ్డది.

"ఏమంటావురా గోపాలం" అన్నది.

ఏమనడానికి నేను సావిత్రిని చూడలేదు. ఒకవేళ చిన్నతనంలో చూచానేమో సరిగ్గా జ్ఞాపకంలేదు. సుందరం కుటుంబ పరిస్థితులు కూడా నాకు బొత్తిగా తెలియవు. రాకపోకలు లేకపోయినా అమ్మకి ఆ కుటుంబాన్ని గురించిన విషయాలు అన్నీ తెలుసన్లే వుంది.

"పిల్లను ఎప్పుడో చూచాను. లక్షణంగావుంది, కట్నం కానుకలు విషయం మనకి తెలిసినట్లేవుంది. గంపెడు పిల్లలున్నారు. వాడు వెలగబెట్టేదేమో గుమాస్తాగిరి. వాడేమి యివ్వగలడు? అయినా పిల్ల పంతులమ్మ వుద్యోగం చేస్తున్నదని రాసాడు. నెలనెలా జీతంరాళ్ళు తెస్తుంది. కట్నం కానుకలు లేకపోతేనేం" అన్నది అమ్మ.

ఆ సంబంధంపట్ల అమ్మకి వున్న అసక్తిని చూచినతర్వాత. పెళ్ళి

ఒకసారి చూచి రావడమే బాగుంటుందనిపించింది. ఒక వుత్తరం ముక్క-రాసి-మరుసటి రోజే బయలుదేరాను.

అమ్మ కరెక్టుగానే ఊహించింది. సుందరం పాపం చాలా దరిద్రంలో వున్నాడు. లెక్క-పెడితే తప్పు. సంఖ్య తెలియనంత మంది పిల్లలు. ఆ సంసారాన్ని ఎట్లా ఈడ్చుకొస్తున్నాడో ఆ దేవుడికే తెలియాలి.

సుందరం, సుందరంభార్య చాలా ఆప్యాయంగా మాట్లాడారు. సావిత్రి కూడా స్కూలుకు శెలవు పెట్టింది. నిండైన విగ్రహం. తెల్లటి పళ్ళు, వెడల్పాటి కళ్లు, లాగిపెట్టిన కాటుకా-అందమూ-ఆకర్షణా రెండూ వున్నవి. నన్ను చూసి మొదట కాస్త సిగ్గు పడ్డది. కాసేపట్లోనే-సిగ్గునుంచి తేరుకుని-మామూలుగా ఇంట్లో తిరగసాగింది.

చిత్రమేమిటంటే-సావిత్రి నాతో మాట్లాడేవరకూ, సావిత్రిని పెండ్లి చేసుకోవాలన్న ఆలోచన నాకు కలగలేదు.

మధ్యాహ్నం సిగరెట్ కాలుస్తూ పేపరు చూస్తున్నాను. సావిత్రి కాఫీ తెచ్చింది.

"సిగరెట్లు కాలుస్తారా!" మాటలు కలవడానికి-సావిత్రికి దొరికిన చొప్పదంటు ప్రశ్న అది.

"అభ్యంతరమా?" అన్నాను.

"అభ్యంతరం తెలపడానికి ఇదేం రైలుపెట్టె—సినిమాహాలు గనకనా?" అన్నది నవ్వుతూ.

"కాబోయే పెళ్ళాము కదా!"

ప్రాణంలేని మాటలు కూడా మనుషులమీద ఎంత ప్రభావం చూపుతాయో సావిత్రిని చూస్తే అర్థమయింది. పెళ్ళాం అన్న మాట వినగానే సావిత్రి వళ్ళంతా సిగ్గుతో కుంచించుకు పోయింది. తటాల్న వెనక్కి తిరిగి విసురుగా వెళ్ళబోతున్నది. ఆ సిగ్గు పడటమూ-విసురుగా వెళ్ళడమూ చూస్తూంటే, ఆ క్షణాన ఏదో ఆపశక్యంకాని ఉద్రేకం పుట్టుకొచ్చింది. తటుక్కున చెంగు పట్టుకుని లాగాను. ఎంత విసురుగా వెళ్ళబోయిందో-

అంత విసురుగా వచ్చి వళ్ళో వాలింది. ఒక్క ముద్దుతో-వళ్ళోనుంచి జారి ఇంట్లోకి తుర్రుమంది. బహుశా ఆ క్షణమే సావిత్రిని పెళ్ళాడాలన్న బలమైన కోర్కె కలిగింది.

అట్లా కలిగిన కోర్కెను-మొదలంటా తుంచివేసుకోవడానికి ఎంతో కాలం పట్టలేదు. ఆ సాయంత్రమే-కామాక్షి-అంటే సుందరం భార్య-పిడుగులాటి వార్త చెవిని వేసింది.

"చూడు నాయనా గోపాలం-మీ బావకి బొత్తిగా లౌక్యం తెలియదు. తెలిసినవాడయితే-ఆ పిల్ల అభిప్రాయం కనుక్కోకుండా నిన్ను పెళ్ళి చూపులకి పిలిపిస్తాడా? తీరా ఇప్పుడు సావిత్రి ఇంకా రెండేళ్ళపాటు ససేమిరా పెళ్ళి వద్దంటోంది. చెప్పడానికి, చిన్నదీ చితకదీ గనకనా? మనం మనం బంధువులం కాబట్టి సరిపోయె. కొత్తవాళ్ళయితే ఎంత బాధపడాల్సివస్తుందో చూడు నాయనా" అన్నది కామాక్షి అక్కడికి నేనేమో బాధపడనట్టు.

నిజంగా ఆ వార్త షాక్‌లా తగిలింది. ఆవిడ చెబుతున్నంతసేపూ హ్రస్వదృష్టి వున్నవాడికి మల్లే పేపరు ముఖానికి అడ్డేసుకున్నాను. జరిగిన పొరపాటుకు ఆవిడ సుందరం తరపున క్షమాపణ-అర్థగంటసేపు చెప్పింది.

నేను నోరెత్తలేదు. ఆ రాత్రి ట్రెయినుకే వూరికి బయలుదేరాను. ట్రెయినులో కూర్చుని ఎంత ఆలోచించినా సావిత్రి మనస్తత్వం అర్థం కాలేదు నాకు. సావిత్రి రెండేళ్ళపాటు పెళ్ళి వద్దన్నదంటే - పరోక్షంగా నన్ను తిరస్కరించినట్టే లెక్క. నన్ను తిరస్కరించిన మనిషి, నాతో కావాలని మాటలు కలిపింది. ముద్దు పెట్టుకుంటే అడ్డుపెట్టలేదు! ఎందుకని? ఎంత ఆలోచించినా బోధపడలేదు. అటునుంచి నరుక్కువస్తే, సమస్య తెగుతుందేమోనని, సుందరం దంపతుల్ని గురించి కూడా ఆలోచించాను. కావాలని ఉత్తరం రాసినవాళ్ళు, ఏమీ ఇచ్చేస్థితిలో లేనివాళ్లు, నన్ను తిరస్కరించడంలో అర్థంలేదు. తల బద్దలు కొట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదు.

ఏదీ ఏమైనా ఆదిలోనే హంసపాదన్నట్టు మొట్ట మొదటే ఇల్లాంటి అనుభవాన్ని ఎదుర్కోవలసి వచ్చినందుకు చాలా బాధ కలిగింది. ఏదో

న్యూనత ఫీలయ్యాను. సావిత్రి నాకు కాకుండా పోయిందన్న బాధకంటే, సావిత్రి నన్ను తిరస్కరించడమన్నది ఎక్కువబాధ కలుగజేసింది.

"ఏంచేసుకొనివచ్చావురా గోపాలం?" అన్నది అమ్మ. వాస్తవం చెబితే-ఆమె బాధపడుతుంది. నేను బాధపడుతున్నది చాలక ఆవిడను కూడా అందులో ఇరికించడం దేనికి?

"అమ్మాయి నచ్చలేదమ్మా" అన్నాను.

నా సమాధానం ఆవిడమీద రామబాణంలా పనిచేసింది. నోరెత్తలేదు.

మరి కొన్నాళ్ళకి-సావిత్రి నన్ను తిరస్కరించిందన్న అనుమానం రూఢి కావడానికి ఆధారాలు దొరికాయి. నా తర్వాత సావిత్రికి నాలుగైదు సంబంధాలు రావడం-అన్నింటినీ ఏదో ఒక సాకుచెప్పి తిప్పికొట్టడం తెలిసింది. ఇది తెలిసినాక నాపట్ల సావిత్రి ప్రవర్తనకు బాధపడడం మానుకున్నాను. సావిత్రికి ఏవో పెద్ద ఆశలున్నవి. వాటిని పూరించుకొనటానికి తాపత్రయ పడుతున్నది. దానికోసం సంస్కారమున్న వాడెవ్వడూ బాధపడడు. తానైతే ఒక క్షణం సావిత్రి నాకిచ్చిన అనుభవం సావిత్రి మీద అసహ్యం కలుగజేసింది. మరీ అంత ముఖం వాచినదానిలా-నాకు లొంగడమేమిటి?

సరే ప్రపంచమన్న తర్వాత రకరకాల ప్రవృత్తులుంటాయి. వాటిని గురించి విమర్శించుకుంటూ పోవడంకూడా అంతమంచిది కాదేమో అనుకున్నాను.

తర్వాత ఒక ఏడాది కనుకుంటాను నా పెళ్ళి స్థిరపడింది. పెళ్ళి పత్రిక సుందరానికి పంపాను. పంపకపోతే సంస్కారమనిపించుకోదని.

పెళ్ళికి సావిత్రి వస్తుందని నేను వూహించలేదు. సావిత్రి వచ్చింది. ఆ పెళ్ళిరద్దిలో సావిత్రితో మాట్లాడే అవకాశమే కలగలేదు. తీరా వెళ్ళే ముందు వచ్చి "వెళ్ళొస్తాను బావా" అన్నది.

"పాపం చాలా దయగా వచ్చావు" ఎంత వద్దనుకున్నా నోటంటా ఎత్తి పొడుపుమాట వచ్చింది.

"ఆడవాళ్ళదయ ఏం దయలే బావా" అన్నది సావిత్రి.

"నేనడుగుతున్నది డబ్బువిషయంకాదు" సావిత్రి నవ్వుతూ అన్నది.

"నిజమే మరి ఆడవాళ్ళదయకి నిలకడలేదు."

సావిత్రి మరేమీ మాట్లాడలేదు. 'వస్తాను' అంటూ సమాధానం ఆశించకుండానే వెళ్ళిపోయింది.

మళ్ళీ సావిత్రిని గురించిన ఆలోచన నాలో తొలచడం ప్రారంభించింది. నామీద అయిష్టమున్న మనిషి పెళ్ళికి రావడందేనికి? సావిత్రి వైఖరి చూస్తే-నాపట్ల సావిత్రికి అయిష్టత వున్నట్టు ఊహించ బుద్ధిపుట్టలేదు. నిజానికి ఆడవాళ్ళ మనస్తత్వాల్ని గురించి ఆలోచించడమంత తెలివి తక్కువ తనం మరొకటి వుండదనిపించింది.

పెళ్ళయి సంసార బాధ్యతమీద పడ్డాక సావిత్రిని పూర్తిగా మరచిపోయ్యాను. ఎవరిని గురించి ఆలోచించడానికీ తీరిక దొరకలేదు.

ఆరేళ్ళ తర్వాత పూర్తిగా మరచేపోయిన సావిత్రి-మళ్ళీ కలిసింది. ఆ కలవటం-హంపీలో జరిగింది.

నేనూ మరో ఇద్దరు మిత్రులూ కలసి హంపీకి వెళ్ళాము. పైన దేవాలయాలూ, శిల్పాలూ అన్నీ చూచి "లోటస్ మహల్" దగ్గరికి వచ్చేసరికి నాకు కాళ్లు పీకుతున్నాయి. ఇక ఎక్కడికీ కదలాలనిపించలేదు. కూడా వచ్చిన వారిని గజశాలా అవీ చూడటానికి పంపి అక్కడే కూచున్నాను. బిలబిలమంటూ ఇరవై ముప్పై మంది పిల్లలూ, సావిత్రీ అక్కడికే వచ్చారు అకస్మాత్తుగా. సావిత్రి నన్నుచూచి దగ్గరికి వచ్చింది. సావిత్రిలో అప్పటికీ, ఇప్పటికీ చాలా మార్పువచ్చింది. మనిషిలో బిగి బిగి రెండూ సడలాయి. కళ్ళు నిర్జీవంగావున్నాయి. అప్పుడే యవ్వనానికి పొద్దు తిరిగింది.

"ఏం సావిత్రీ ఎక్స్‌కర్షన్ వచ్చారా?" అన్నాను.

"అవును బావా, నువ్వు ఒక్కడివే వచ్చినట్టుందే" అన్నది. వెంట వచ్చిన మిత్రుల విషయం చెప్పాను. సావిత్రి పిల్లల్ని చెట్లకింద కూచోని విశ్రాంతి తీసుకోమని చెప్పి, "పద బావా పైకిపోదాం" అన్నది.

పైన చల్లటి గాలి వీస్తున్నది. సావిత్రి ఫ్లాస్కు తీసి, కాఫీ ఇచ్చి "ఎట్లావుంది బావా హంపీ?" అన్నది.

"హంపీ చూచిన తర్వాత నెహ్రూగారన్నట్లు "వాటె స్కాండలస్ వేస్ట్ ఆఫ్ మని" (ఎంత దుబారా?) అన్న మాటలు జ్ఞాపకం వస్తున్నాయి" అన్నాను.

"శిల్పాల విషయమై బ్రహ్మాండంగా వున్నాయి. ఆ విషయం నీ వెంట వచ్చిన పసిపిల్లల్నడిగినా చెబుతారు."

హంపీ శిథిలాలు సావిత్రిని ఎంతగానో కదలించి నట్టున్నాయి.

"ఈ మహలు చూడుబావా ఎంతబావుందో ఈ మహలు చూస్తూంటే. అప్పటి రాణులూ, వారిక్రీడలూ-అన్నీ వూహలో మెదిలి ఏ దూర తీరాలకో తీసుకపోవడంలేదా?" అన్నది చుట్టూ చూస్తూ.

"ఊహలో మెదిలేది-ఏంక్రీడలు-రాసక్రీడలా?"

"ఊహలుకూడా-వ్యక్తి సంస్కారాన్నిబట్టి కలుగుంటాయి."

నవ్వుతూనే సావిత్రి నా నోరు మూయించింది. కాసేపు సావిత్రి పంతులమ్మ ధోరణిలో హంపీ శిథిలాలను వర్ణిస్తూ కూచుంది. "సరే ఆ శిథిలాల మాటకేంగాని-నీ పెళ్ళి విషయం చెప్పు. ఇంకా ఎన్నాళ్లు యీ బ్రహ్మచర్యం?" అన్నాను.

ముసుకున వుండివేసిన రాయిలా-నేను వేసిన ప్రశ్న సావిత్రికి తగిలింది. ముఖం వివర్ణమైంది. కళ్ళల్లో దైన్యం తొంగి చూచింది. "నా పెళ్ళి గురించి నీ కెందుకు బాధ?" అన్నది పెదిమలమీదికి నవ్వు తెచ్చుకుంటూ.

"బాధకాదు ఆదుర్దా. నీ వూహల్లో మెదిలే నీ ఆదర్శభర్తని కళ్ళతో చూసి ఆనందిద్దామని."

"నా వూహలో ఎవ్వరూ మెదలందే" అన్నది.

"ఇన్ని సంబంధాలు ఎందుకని తిప్పికొట్టినట్టో?"

సావిత్రి ఏదో జవాబు చెబుతుందనుకున్నాను. నాలో ఎన్నాళ్లగానో తొలుస్తున్న సమస్యకి సమాధానం దొరుకుందనుకున్నాను. కానీ అలాంటిదేమీ జరగలేదు.

సావిత్రి వెక్కి వెక్కి ఏడుస్తోంది!

ఇలాంటి సంకటావస్థను ఎదుర్కోవలసి వస్తుందని నే నూహించలేదు. మొదట్లో ఏదో శూన్యం ప్రవేశించింది.

అదృష్టవశాత్తూ సావిత్రి త్వరలోనే ఆ స్థితినుంచి బయటపడ్డది. కన్నీళ్ళు పైటకొంగుతో తుడుచుకొని, "నన్ను నువ్వుకూడా నమ్మలేవా బావా?" అన్నది.

సావిత్రి ఏం చెబుతున్నదో నాకర్థం కాలేదు.

"నువ్వు వచ్చిన ప్రతి సంబంధానికీ ఏదో ఒకవంక పెట్టి తిరస్కరించడం నిజంకాదా?'' అన్నాను.

సావిత్రి లేదన్నట్లు తలూపి, "అంతా వట్టిదే నేను ఏ సంబంధాన్నీ తిరస్కరించలేదు. ఇదంతా మా అన్నా, ఒదినె ఆడుతున్న నాటకం. అందులో నేను కేవలం వాళ్ళ చేతుల్లో కీలుబొమ్మని'' అన్నది గాద్గదికంగా.

సావిత్రి అన్న మాటలు షాక్‌లా తగిలాయి. చెల్లెలి జీవితాన్ని బుగ్గిపాలుచేసే అన్నగారుంటారని నేనూహించని విషయం. అందువల్ల వాళ్ళకు ఒరిగేదేమిటో నాకు అర్థం కాలేదు.

''దేనికోసం-ఈ నాటకం?'' ప్రశ్నించాను. సావిత్రి ఠక్‌మని జవాబు చెప్పింది. "పొట్టకోసం. నాకు పెళ్ళయి అత్తవారింటికి వెళితే ఇంటిల్లపాదీ పస్తులతో మాడవలసి వస్తుంది, అన్నకి వచ్చేజీతం ఏ మూలకి సరిపోతుంది గనుక? అందుకనే వాళ్ళు నా పెళ్ళి వాయిదా వేస్తున్నారు, కేవలం లోకం కళ్ళు కప్పడానికి సంబంధాలు తెస్తున్నారు.''

సావిత్రిని చూస్తుంటే హృదయం జాలితో నిండిపోయింది. చెప్పుకింది పూవులా సుందరం స్వార్థానికి-సావిత్రి నలుగుతోంది. "ఈ అన్యాయాన్ని ఎందుకు సహిస్తున్నావు సావిత్రీ'' అన్నాను. సావిత్రి విషాదంగా నవ్వింది. ''కేవలం పొట్టకూటికి చేసేవి అన్యాయాలు అనిపించుకోవు. ఆ స్థితిలో సాధారణంగా చాలామంది అలాగే ప్రవర్తిస్తారు. వాళ్ళనుచూసి-అసహ్య పడటంకాదు. చేయవలసింది జాలిపడాలి'' అన్నది సావిత్రి.

కాసేపు మౌనంగా కూచుని-సావిత్రి కిందికి దిగిపోయి-పిల్లలలో కలసిపోయింది.

సుందరం - సావిత్రి - కామాక్షీ - అంతా సానుభూతి చూపవలసిన వ్యక్తులే! ఇవ్వాళ ఏదో ఒక కొత్త సత్యం తెలుసుకున్నాననిపించింది. అనుకోకుండానే లోటస్ మహల్‌లో రెండు కన్నీటి చుక్కలు వదిలాను.

మరపురాని స్మృతిలా నిలిచిపోయింది హంపీ అనుభవం!

—:o:—